సాక్షి
నారాయణపేట
గురువారం । 13 । ఫిబ్రవరి । 2025



వైభవంగా పౌర్ణమి వేడుకలు
జములమ్మ ఆలయంలో బుధవారం పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి.
వివరాలు 8లో ▸



ఉదండాపూర్ పనుల అడ్డగింత
జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్ రిజర్వాయర్ పనులను నిర్వాసితులు అడ్డుకున్నారు.
వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.1 /15.8

వాతావరణం
ఉదయం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

అనుచిత పోస్టులు చేయొద్దు : ఎస్పీ

నారాయణపేట: సామాజిక **మాధ్యమాల్లో** విద్వేషాలు, రెచ్చగొట్టే **వ్యాఖ్యలు, దుష్ప్ర**చారం మరియు ఇతరుల **మనోభావాలు** దెబ్బతీసే విధమైన పోస్టులు పెట్టేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ యోగేష్ గౌతమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయం, కుల, మత, ప్రాంతీయంగాను ప్రజల భద్రతకు విఘాతం కలిగించేవిగా ఉన్న వాటిని సామాజిక మాధ్యమాలలో షేర్ చేసినా చట్టప్రకారం తీవ్రమైన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాలు, గ్రూపుల్లో ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా, ఒక వర్గాన్ని కించపరిచే విధంగా ఉన్న, తమకు తెలియని వీడియోలు, ఫొటోలు పోస్టు చేసిన, ఇతరులకు ఫార్వర్డ్ చేసిన ఆ గ్రూపు అడ్మిన్‌నే బాధ్యుడిగా చేస్తూ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. సామాజిక మధ్యమాలను మంచి పనులకు తప్ప వేరే రకంగా వినియోగించే వాళ్లపై ప్రత్యేక నిఘా ఉంచి పోలీసులు నిరంతరం పరిశీలిస్తుంటారని, జాగ్రత్త వహించాలని సూచించారు.

20న పేటెంట్ రైట్స్‌పై అవగాహన సదస్సు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఈ నెల 20న పేటెంట్ రైట్స్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు వీసీ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు పీయూలో కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేటెంట్ రైట్ పొందే వారు ఏ విధంగా నమోదు చేసుకోవాలి.. అందులో ఎదురయ్యే సవాళ్లు, పరిష్కార మార్గాలు తదితర అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. ముఖ్య వక్తగా శంకర్‌రావు ముంజం హాజరవుతారని, ఈ అవకాశాన్ని విద్యార్థులు, అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చైర్మన్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, కోకన్వీనర్ మధు, క్రైటీరియ కోఆర్డినేటర్ కరుణాకర్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఈశ్వర్‌కుమార్, గాలెన్న తదితరులు పాల్గొన్నారు.

ఉలవల క్వింటాల్ రూ.4,191

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం ఉలవలు క్వింటాల్‌కు గరిష్ఠం, కనిష్ఠంగా రూ.4,191 ధర పలికాయి. అలాగే, వేరుశనగ గరిష్ఠంగా రూ.6,312, కనిష్ఠంగా రూ.4,686, వడ్లు హంస గరిష్ఠ, కనిష్ఠంగా రూ.2,005, వడ్లు సోనా గరిష్ఠం, కనిష్ఠంగా రూ.2,479, ఎర్ర కందులు గరిష్ఠంగా రూ.7,777, కనిష్ఠంగా రూ.5,062, తెల్ల కందులు గరిష్ఠంగా రూ.7,673, కనిష్ఠంగా రూ.6,455 ధర పలికింది.

నేచర్ గైడ్‌తో ఎకో టూరిజం బలోపేతం



మన్ననూర్: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డెక్కన్ వుడ్స్ అండ్ ట్రైల్స్ బ్రాండ్ పేరుతో అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టులో నాలుగు రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్ అన్నారు. ఎకో టూరిజం, వన్యప్రాణుల అభివృద్ధి చేసేందుకు లక్ష్యంగా తీసుకుని కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. నాలుగు రోజులపాటు కొనసాగే ఈ కార్యక్రమంలో సిద్ధాంత పాఠాలు, ఫీల్డ్ ప్రాక్టికల్స్ శిక్షణ, పరస్పర చర్చలు, అనుభవజ్ఞులైన వారితో జీవవైవిధ్యం, ఎకో టూరిజం తదితర వాటిపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. జంగిల్ సఫారీలో భాగంగా తెల్లవారుజామున జరిగే ట్రెక్కింగ్‌లో అనేక రకాల జంతువులు ప్రత్యక్షంగా గమనించే అవకాశం ఉంటుందన్నారు. ఈ నేచర్ గైడ్ ప్రోగ్రాం తెలంగాణలోని ఎకో టూరిజాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆశిస్తున్నామన్నారు. అనంతరం నేచర్ గాడ్ ప్రోగ్రాం విధివిధానాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎకో టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ తనూజ, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, ఎఫ్‌ఆర్‌ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బోనస్‌పైనే ఆశలు..!



కృష్ణాలోని కేంద్రంలో వరి ధాన్యం కొనుగోళ్లు (ఫైల్)

- ధాన్యం విక్రయించి నెలలు గడుస్తున్నా అందని డబ్బులు
- రైతులకు తప్పని ఎదురుచూపులు
- జిల్లాలో పెండింగ్ రూ.10.46 కోట్లు

నారాయణపేట: ధాన్యం బోనస్ డబ్బుల కోసం జిల్లా రైతులు ఎదురుచూస్తున్నారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లు ముగిసి రెండు నెలలు పూర్తయిన నేటికీ ఖాతాల్లో నగదు జమ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు వరి ధాన్యం క్వింటాపై రూ.500 బోనస్ ఇస్తామని చెప్పడంతో చాలామటుకు రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 102 వరి ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 89,928 ధాన్యం (ఎంటీఎస్) కొనుగోలు చేశారు.

రూ.10.46 కోట్ల కోసం ఎదురుచూపులు

రైతులకు ఆర్థికంగా భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యానికి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,320తో పాటు అదనంగా రూ. 500 చొప్పున బోనస్ చెల్లించాల్సి ఉంది. జిల్లాలో 12,597 మంది రైతులతో దొడ్డు రకం 18,175 మెట్రిక్ టన్నులు, సన్నరకాలు 71,750 మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి క్వింటాల్‌కు రూ. 2,320 చొప్పున రైతులందరికి చెల్లించాల్సిన డబ్బులు రూ.208.63 కోట్లు రైతుల ఖాతాలో జమ అయ్యాయి. సన్నరకాల ధాన్యం కొనుగోళ్లలో 7,17,653 క్వింటాళ్లకు గాను రూ.35.88 కోట్ల చెల్లింపులకు గాను రూ.25.41 కోట్లు చెల్లించారు. మిగతా రూ.10.46 కోట్ల మేర రైతులకు బోనాస్ చెల్లించాల్సి ఉండగా గత రెండు నెలలుగా రైతులు ఆందోళనతో ఎదురుచూస్తున్నారు. సన్న రకాలు విక్రయించిన రైతుల వివరాలు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టంలో ఆన్‌లైన్ నమోదుచేసి పౌరసరఫరాల శాఖ మార్కెటింగ్ అధికారి లాగిన్‌కు పంపించడంతో డబ్బులు రైతుల ఖాతాలో జమ అయ్యాయి. సన్న రకాల బోనస్ చెల్లించేందుకు డీఎస్‌ఓ లాగిన్‌కు వెళతాయి. అక్కడి నుంచి రైతుల ఖాతాలో జమ కావాల్సి ఉంది.

జిల్లాలో ధాన్యం కొనుగోలు వివరాలిలా..

ఏజెన్సీ	సెంటర్లు	రైతులు	దొడ్డు రకం (ఎంటీఎస్)	సన్నరకం (ఎంటీఎస్)	మొత్తం (ఎంటీఎస్)
ఐకేపీ	37	3,982	6,252	18,528	24,307
పీఏసీఎస్	60	7,863	10,266	52,103	62,369
మెప్మా	2	626	1,228	1,548	2,699
ఎఫ్‌పీఓ	03	126	428	122	551
మొత్తం	102	12,597	18,175	71,750	89,928

డబ్బులు రాలే



రెండు నెలల క్రితం 76 క్వింటాళ్ల సన్న వడ్లు ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించా. క్వింటాకు రూ.2320 చొప్పున నా బ్యాంకు ఖాతాలో రూ.1.76 లక్షలు జమ అయ్యాయి. కానీ, బోనస్ డబ్బులు రూ.38 వేలు ఇంకా జమ కాలేదు. ప్రభుత్వం వెంటనే బోనస్ డబ్బులు ఖాతాల్లో జమ చేయాలి.

– రాఘవరెడ్డి, రైతు, నిడ్జింత

నెల రోజులైనా అందలే..



దాదాపు నెల రోజుల క్రితం మొత్తం 38 క్వింటాళ్ల సన్న వడ్లు ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించా. ధాన్యం డబ్బు మాత్రం ఖాతాలో వేశారు. బోనస్ డబ్బు మాత్రం ఇంకా జమ కాలేదు. త్వరగా వేస్తే పంటల పెట్టుబడికి ఇతర ఖర్చులకు ఎంతో ఉపయోగపడుతుంది.

– దోరోళ్ల సాయప్ప, రైతు, కొత్తపల్లి

త్వరలో జమ అవుతాయి



బోనస్ చెల్లింపులో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యం డబ్బులు ఇప్పటి వరకు అందరికి పడ్డాయి. బోనస్ డబ్బులు సైతం రోజు పడుతున్నాయి. మరో పక్షం రోజుల్లో అందరికీ డబ్బులు పడే అవకాశం ఉంది.

– సుదర్శన్, డీఎస్‌ఓ

ఎన్నికలకు సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. రిటర్నింగ్ అధికారులు, స్టేజ్ వన్, టూ సహాయ రిటర్నింగ్ అధికారులకు జిల్లా కేంద్రంలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ సింగారంలో బుధవారం మొదటి దశ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ముందస్తుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియమ, నిబంధనలపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకోవాలని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా నిబంధలను తూచా తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ ప్రకటనను అనుసరిస్తూ ఆర్‌ఓలు నోటిఫికేషన్ జారీ చేసి, ఆ రోజు నుండే సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల ఎన్నిక కోసం నామినేషన్లు స్వీకరించాల్సి ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా ఉండే గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముందుగానే ఎంపిక చేసుకుని, నోటిఫికేషన్ లో స్పష్టంగా వివరాలను పొందుపర్చాలన్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. సమయపాలనను పక్కాగా పాటిస్తూ, నామినేషన్ల స్వీకరణ కేంద్రం గదిలో తప్పనిసరిగా గోడ గడియారం అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులతో పాటు వారి ప్రతిపాదకులు స్థానికులేనా అన్నది ఓటరు జాబితా ఆధారంగా నిర్ధారణ చేసుకోవాలన్నారు.

నిబంధనలు తప్పనిసరి

అభ్యర్థులు ఎన్ని సెట్ల నామినేషన్లు సమర్పిస్తే, అన్ని నామినేషన్ల దరఖాస్తులను తప్పనిసరిగా పరిశీలించాలని, వాటిలో ఎన్ని ఆమోదించబడ్డాయి, ఎన్ని తిరస్కరణకు గురయ్యాయి, అందుకు గల కారణాలు ఏమిటీ అనే అంశాలను వెల్లడించాల్సి ఉంటుందని కలెక్టర్ సూచించారు. నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుండి ప్రతి రోజు త్వరితగతిన డైలీ రిపోర్టును పంపించాలని, సంబంధిత వెబ్ సైట్లో అభ్యర్థుల నామినేషన్ పత్రాలను స్కాన్ చేసి అప్లోడ్ చేయాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ చివరి సమయంలో, విత్ డ్రా సమయాల్లో వీడియో చిత్రీకరణ చేయిస్తే, తగిన ఆధారాలుగా ఉపయోగపడతాయని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా పక్కాగా జరిగితే, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్‌ఓలు, సహాయ ఆర్‌ఓలకు కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. శిక్షణ తరగతుల్లో ట్రైనీ కలెక్టర్ గరిమనరుల, అదనపు కలెక్టర్ బెన్‌షాలం, డీపీఓ కృష్ణ, డీఈఓ గోవిందరాజు, ఆర్.ఓలు, సహాయ ఆర్.ఓలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి



మాట్లాడుతున్న సీజీఎం ప్రభాకర్

నారాయణపేట: వేసవిలో విద్యుత్ డిమాండ్ పెరిగినా.. సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటూ నాణ్యమైన విద్యుత్ అందజేయాలని సీజీఎం ప్రభాకర్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ట్రాన్స్‌కో ఎస్‌ఈ కార్యాలయంలో బుధవారం జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముందస్తు ప్రణాళికలో భాగంగా వేసవిలో పెరిగే విద్యుత్ వాడకం తట్టుకొనే విధంగా అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రూ.4 కోట్లు, 11 కేవీ లైన్ నిర్మాణం కోసం రూ.80 లక్షలు, 33 కేవీ లైన్ ఏర్పాటుకు రూ.30 లక్షలు, నూతన డీటీఆర్‌కు రూ.4.5 లక్షలు ప్రణాళికలను రూపొందించారన్నారు. ప్రత్యేక చొరవ తీసుకుని విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా సరఫరా చేసేలా వనరులు సమకూర్చుకోవాలన్నారు. 33/11 కేవీ ఉప విద్యుత్ కేంద్రాల పనితీరును పర్యవేక్షించటం, నియంత్రికల ఓవర్ లోడ్ లేకుండా నూతన వాటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే 11 కేవీ విద్యుత్ తీగల అధిక లోడ్ లేకుండా విద్యుత్ నియంత్రికలు అవసరమైన చోట మార్చుటకు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ సంజీవరెడ్డి, డీఈ శ్రీనివాస్, డీఈటీ జితేందర్, నర్సింహ రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ జట్టు ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఈనెల 18, 19 తేదీల్లో 10న జరిగే రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లాల అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపికలను నేడు (గురువారం) జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.శరత్‌చంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–14, అండర్–16, అండర్–18, అండర్–20 లోపు బాలబాలికలకు ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహిస్తామని, ఆసక్తి గల క్రీడాకారులు ఎస్‌ఎస్‌సీ మెమో, తహసీల్దార్ ద్వారా కుల ధ్రువపత్రం, జనన ధ్రువపత్రాలతో రిపోర్ట్ చేయాలని కోరారు. మిగతా వివరాల కోసం 9492177535, 9440656162 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

జనసంద్రం.. మన్యంకొండ క్షేత్రం

- గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయ గిరులు
- రథోత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తులు

– మహబూబ్‌నగర్ రూరల్



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం

– వివరాలు 8లో..

గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: గిరిజనుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండలంలోని సోమశిల గ్రామంలో ఏబీసీసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఆదివాసీ గిరిజనులకు రాజకీయ శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావుతోపాటు ట్రైకా చైర్మన్ బెల్లయ్యనాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారు జ్యోతి ప్రజల్వన చేసి శిక్షణ తరగతులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల హక్కులు, వాటి పరిరక్షణ తదితర అంశాలపై శిక్షణ శిబిరంలో వక్తలు వివరిస్తారని చెప్పారు. శిక్షణ తరగతులను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మూడు రోజులపాటు కొనసాగే శిక్షణ తరగతుల్లో పలువురు ప్రొఫెసర్లు, ఎమ్మెల్యేలు గిరిజనులకు సంబంధించిన అన్ని అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. అనంతరం గిరిజన సంఘం నాయకులు మంత్రి జూపల్లిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు లింగయ్యనాయక్, హన్మంతునాయక్, శంకర్‌నాయక్, గోపి, బన్సీరాం, బాలు, శ్రీరామ్‌నాయక్ పాల్గొన్నారు.



మంత్రి జూపల్లి కృష్ణారావును సన్మానిస్తున్న గిరిజన సంఘం నాయకులు

పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి

కృష్ణా తీర ప్రాంతాలను పర్యాటకంగా తీర్చిదిద్దుతామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం ఆయన టూరిజం కార్పొరేషన్ ఎండీ ప్రకాష్‌రెడ్డితో కలిసి సోమశిల నదీతీర ప్రాంతాలు పరిశీలించారు. లాంచీలో వెళ్లి మల్లేశ్వరం ఐల్యాండ్, అమరగిరి ప్రాంతాలను సందర్శించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సోమశిలలో భక్తుల విడిది కోసం నూతనంగా షెడ్లు, డార్మెటరీ గదులు నిర్మించనున్నట్లు చెప్పారు. పర్యాటకులను ఆకర్షించేలా కాటేజీలు ఇతరవి తీర్చిదిద్దుతామన్నారు. సోమశిల నుంచి శ్రీశైలం వరకు వెళ్లే లాంచీని రోజువారీగా తిప్పేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు.

పీఏసీఎస్ పాలకవర్గాల పదవీకాలం పొడిగించాలి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పదవీకాలాన్ని మరో ఏడాదిపాటు పొడిగించాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పీఏసీఎస్ చైర్మన్లు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం జిల్లాకేంద్రంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ కోరమోని వెంకటయ్య, పాలక మండలి సభ్యులు రంగారెడ్డి, మంజులారెడ్డి, భూపాల్‌రావు, బక్కన్నయాదవ్, భీంరెడ్డి, వెంకటేష్ గుప్తా, వంశీచంద్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్లు పలు విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేలా సంతకాల సేకరణ చేపట్టారు.

■ ఇదిలా ఉండగా.. సర్పంచ్‌లు, ఎంపీపీలు, జిల్లా పరిషత్, మున్సిపల్ పాలకవర్గాల కాలపరిమితి ముగియగానే ప్రత్యేకాధికారుల పాలన మొదలవుతుంది. కానీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో మాత్రం మళ్లీ ఎన్నికలు జరిగే వరకు ప్రస్తుతం ఉన్న పాలకవర్గాన్ని ఆరు నెలల కాలపరిమితితో పొడిగిస్తూ ఆదేశాలు ఇవ్వడం ప్రభుత్వ సంప్రదాయంగా కొనసాగుతుంది. గత మూడు దశాబ్దాలుగా పీఏసీఎస్ పదవీకాలం ముగిసిన రెండేళ్ల వరకు ఎన్నికలు జరగకపోయినా ప్రతి ఆరునెలలకు ఒకసారి పాలకవర్గాన్ని కొనసాగిస్తూ ఎన్నికలు నిర్వహించే పద్ధతి ఉంది. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో ఉన్న 9 డీసీసీబీ బ్యాంకుల్లో రైతులకు అన్ని రకాలుగా అండగా ఉండటంతోపాటు వాణిజ్యపరంగా మంచి అభివృద్ధి సాధించాయి. అందుకే అధికారుల ఇన్‌చార్జి పాలనలో కొనసాగే కంటే ఉన్న పాలకవర్గాలను కొనసాగించాలని కోరుతూ అన్ని ఉమ్మడి జిల్లాల్లోని డీసీసీబీ చైర్మన్ల అధ్యక్షతన సమావేశం నిర్వహించి వినతిపత్రాలు అందించాలనే రాష్ట్రంలోని ఉమ్మడి డీసీసీబీ చైర్మన్ల నిర్ణయంలో భాగంగానే ఈ సమావేశం జరిగింది. ప్రస్తుతం ఒక్క పాలమూరు జిల్లాలోనే కాకుండా అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాల డీసీసీబీ బ్యాంకుల్లో వాటి పర్యవేక్షణలో పని చేసే పీఏసీఎస్‌ల చైర్మన్లు తమ సొసైటీల అభివృద్ధికి సంపూర్ణంగా సేవలు చేస్తున్నందున ఈ పాలకవర్గాలనే కొనసాగించాలని పీఏసీఎస్ చైర్మన్ల ఫోరం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌గౌడ్ ఆకాంక్షించారు.

భక్తులతో కిక్కిరిసి పోయిన క్యూలైన్



కోనేరులో స్నానాలు ఆచరిస్తున్న జనం



జనసంద్రం.. మన్యంకొండ క్షేత్రం

- గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయ గిరులు
- ఒక్కరోజే స్వామివారిని దర్శించుకున్న లక్ష మంది భక్తులు
- రథోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసిన దేవాదాయ శాఖ అధికారులు
- జాతర కోసం పలు డిపోల నుంచి 16 ప్రత్యేక బస్సులు



ఎద్దులతో జాతరకు వస్తున్న రైతు



జాతర ప్రాంగణం వ్యూ

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి క్షేత్రం బుధవారం భక్త జనసంద్రమైంది. భక్తుల గోవింద నామస్మరణంతో ఆలయ గిరులు మార్మోగిపోయాయి. రెండో తిరుపతిగా పేరొందిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని బుధవారం అర్ధరాత్రి రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సుమారు లక్షకు పైగా భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. రథోత్సవం సందర్భంగా స్వామివారిని దర్శించుకుంటే తమ పాపాలు తొలగి మోక్షం లభిస్తుందని భక్తుల విశ్వాసం. రథోత్సవంలో పాల్గొనడానికి వచ్చిన భక్తులకు అవసరమైన అన్నిఏర్పాట్లను దేవాదాయ శాఖతో పాటు మన్యంకొండ పాలకవర్గాలు చేపట్టాయి. ముఖ్యంగా రవాణా సదుపాయాలను మెరుగుపరిచారు. వసతి సౌకర్యాలను సైతం సమకూర్చారు. జాతర ప్రాంగణంలో తాగునీటి కోసం ప్రత్యేకంగా నిర్మించిన వాటర్ ట్యాంక్‌ల్లో ముందుగానే నీటిని నిల్వ ఉంచారు. మన్యంకొండ దేవస్థానంతో పాటు దేవస్థానం చుట్టూ గల కొండలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించడంతో కొండలన్నీ దేదీప్యమానంగా వెలుగుతున్నాయి.

జాతరకు ప్రత్యేక బస్సులు

మన్యంకొండ శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి జాతరకు తరలివస్తున్న భక్తుల సౌకర్యార్థం టీఎస్ ఆర్టీసీ యాదాద్రి, సంగారెడ్డి, దుబ్బాక, ప్రజ్ఞాపూర్‌ల నుంచి ప్రత్యేకంగా 16 బస్సులను తెచ్చి కొండ కింది నుంచిపై వరకు నడుపుతుంది. బస్సులను సమయానుకూలంగా నడుపుతుండటంతో భక్తులు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా కొండపైకి చేరుకుంటున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు డిపోల నుంచి మన్యంకొండ స్టేజీ వరకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు.

దాసంగాలు సిద్ధం చేస్తున్న మహిళలు





వైభవంగా పౌర్ణమి వేడుకలు

- జములమ్మ అమ్మవారిని దర్శించుకున్న 50 వేల మంది భక్తులు
- సాంప్రదాయబద్ధంగా పల్లకీసేవ



ప్రత్యేక అలంకరణలో జములమ్మ అమ్మవారు



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

గద్వాల న్యూటౌన్: డోలు చప్పుళ్లు, డప్పుల మోతలు, మంగళ వాయిద్యాలు, భక్తుల పూనకాల నడుమ బుధవారం జములమ్మ అమ్మవారి పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. తెల్లవారుజామున 3 గంటలకు 108 కలశాలతో అమ్మవారిని అభిషేకించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి 4.30 నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉమ్మడి జిల్లాతో పాటు ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వచ్చిన భక్తులు ఉదయం 3.30 నుంచే దర్శనానికి క్యూలైన్లలో నిలుచున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 50 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో భక్తుల రద్దీ పెరిగి ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. సల్లంగా చూడమ్మ జములమ్మ తల్లీ అంటూ భక్తులు వేడుకున్నారు. పలువురు భక్తులు కోళ్లు, మేకపోతులు బలిచ్చి మొక్కులు చెల్లించుకోగా మరికొందరు నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం పల్లకీసేవ నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పల్లకీలో ఉంచి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. పౌర్ణమి వేడుకలకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ వెంకట్రాములు, ఈఓ పురందర్‌కుమార్ పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మదనేశ్వర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకొని, ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసులు, ఆలయ సిబ్బంది క్యూలైన్లలో తోపులాట జరగకుండా నియంత్రించారు. ఎండవేడిమిని తట్టుకోలేక చాలామంది భక్తులు ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో సేద తీరడం కనిపించింది.



డోలు వాయిద్యంతో ఆలయానికి వస్తున్న భక్తులు



మొక్కు చెల్లించేందుకు వెళ్తున్న మహిళా భక్తురాలు

వైభవంగా కురుమూర్తిరాయుడి గిరి ప్రదక్షిణ



మహాయజ్ఞం నిర్వహిస్తున్న రఘోత్తమాచార్య స్వామి

చిన్నచింతకుంట: మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం అమ్మాపురం కురుమూర్తిస్వామి సన్నిధిలో విశ్వహిందూ పరిషత్, జ్ఞానపీఠం అంతర్జాతీయ ధార్మిక, వ్యక్తి వికాస శిక్షకుడు రఘోత్తమాచార్య ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ, మహాయజ్ఞం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో అర్చకుల వేద మంత్రోచ్ఛారణల నడుమ యజ్ఞ హోమాదులు నిర్వహించారు. సాయంత్రం గిరి ప్రదక్షిణ కార్యక్రమం కొనసాగగా.. పరిసర గ్రామాల భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కురుమూర్తిగిరులు గోవింద నామస్మరణలతో మార్మోగాయి. కార్యక్రమం ముగిశాక స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

రెండో రోజూ కొనసాగిన పరిశీలన

- పలు కార్యాలయాల్లో పనితీరుపై ఆరా

అడ్డాకుల: అడ్డాకుల మండలం కందూర్, మూసాపేట మండల కేంద్రంలో బుధవారం కేంద్ర సీనియర్ సెక్షన్ అధికారుల బృందం పర్యటన కొనసాగింది. కందూర్‌లో అకింత్‌వర్మ, మదన్‌గోపాల్ భారతి, దీపక్ వర్మ, ఆశీష్ ద్రాలి పర్యటించి పల్లె ప్రకృతివనాన్ని సందర్శించారు. ఉపాధిహామీ కూలీ పనులు చేస్తున్నవారితో అధికారులు మాట్లాడారు. మూసాపేటలో అమిత్‌వర్మ, సోని కుమారి, మీనా కుమారి, మౌనికలు ఎంపీడీఓ, ఎమ్మార్వో కార్యాలయాన్ని సందర్శించారు. ఎంపీడీఓ కార్యాలయం పనితీరు, ఆసరా పింఛన్లు, వచ్చిన దరఖాస్తులపై ఆరాతీశారు. ఎమ్మార్వో కార్యాలయంలో పాఠశాలలకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం అమలుపై ఆరా తీశారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

భూత్పూర్: మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్రటేరియల్ ట్రైనింగ్ అండ్ మేనేజ్‌మెంట్ (ఐఎస్‌టీఎం) న్యూఢిల్లీకి చెందిన నలుగురు బృంద సభ్యులు వివిధ గ్రామాల్లో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, ప్రజలకు లబ్ధి ఎలా చేకూర్చుతారని సెక్షన్ ఆఫీసర్లు మండల అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిక్షణలో భాగంగా సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీసెస్(సీఎస్ఎస్)కు చెందిన సెక్షన్ ఆఫీసర్లు దీపక్‌మీనా, అరవింద్‌కుమార్, మహ్మద్ ఖాషిఫ్ అన్సారీ, శశికుమార్‌చౌదరి ఏఏ పథకాలు అమలు చేస్తున్నారని, అభివృద్ధి పనులు, తదితర విషయాలపై ఆరాతీశారు. మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో మహిళా సంఘాల వివరాలు, వారికి ఎన్ని రకాలుగా లోన్లు అందజేశారు, తిరిగి చెల్లించే విధానంపై బ్యాంక్ మేనేజర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్, ఎంపీఓ శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్, ఏపీఓ విమల తదితరులున్నారు.



భూత్పూర్ ఎంపీడీఓ కార్యాలయంలో సెక్షన్ ఆఫీసర్లతో ఎంపీడీఓ ప్రభాకర్

క్లుప్తంగా

విద్యుత్ టవర్‌కు ఉరేసుకొని యువకుడు బలవన్మరణం



సురేష్ (ఫైల్)

తిమ్మాజిపేట: భూమి అమలు(పట్టా చేసుకోవడం) విషయంలో మనస్తాపం చెందిన సురేష్(21) అనే యువకుడు విద్యుత్ టవర్‌కు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మండలంలోని కోడుపర్తిలో బుధవారం ఈఘటన చోటుచేసుకున్నట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి మృతుడి తల్లి పేరున ఉన్న రెండెకరాల భూమిని పట్టా చేసుకున్నాడు. తనకు పట్టా చేయాల్సిన భూమి చేయకుండా వేధిస్తుండడంతో సురేష్ వాళ్ల ఇంట్లో తరుచూ గొడవలు జరిగేవి. దీంతో మనస్తాపం చెందిన అతడు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బుధవారం వ్యవసాయ పొలంలో విద్యుత్ టవర్‌కు ఉరేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి తల్లి అలివేల, తండ్రి మాసయ్య, ఓ తమ్ముడు ఉన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

అడ్డాకుల: మండలంలోని కాటవరం స్టేజీ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. వనపర్తి సమీపంలోని కిష్టగిరికి చెందిన రవీందర్(32) అడ్డాకులలో నివాసం ఉంటున్నాడు. కొల్లాపూర్ సమీపంలోని పెంట్లవెల్లికి చెందిన షా కొన్నేళ్ల నుంచి భార్యను వదిలేసి అడ్డాకులలోనే ఉంటున్నాడు. రవీందర్, షా కలిసి గుట్టలో రాళ్లు కొడుతూ జీవనం సాగించేవారు. ఈక్రమంలో రాత్రి ఇద్దరు కలిసి బైక్‌పై శాఖాపూర్ వైపు నుంచి అడ్డాకులకు వస్తున్నారు. కాటవరం స్టేజీ వద్ద అడ్డాకుల వైపు నుంచి వచ్చిన జేసీబీ రహదారిని దాటుతుండగా బైక్ ఢీకొట్టింది. దీంతో ఇద్దరు తీవ్రంగా గాయపడగా రవీందర్ కొద్దిసేపటికే మృతిచెందాడు. షా తీవ్రంగా గాయపడటంతో అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

జడ్చర్ల: మండలంలోని వల్లూరు సమీపంలో బుధవారం ఒడిస్సాకు చెందిన గణేష్ సాబర్(33) అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్లు ఎస్ఐ మల్లేశ్ తెలిపారు. ఇతడు ఇటుక బట్టీలో పనిచేసేవాడని.. మద్యం తాగి అనారోగ్యంతో మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశామన్నారు.

‘ఉదండాపూర్’ పనుల అడ్డగింత

- సమస్య పరిష్కరించాకే పనులు చేపట్టాలన్న నిర్వాసితులు



ఉదండాపూర్ రిజర్వాయర్ కట్టపై ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

జడ్చర్ల: మండలంలో కొనసాగుతున్న ఉదండాపూర్ రిజర్వాయర్ పనులను బుధవారం నిర్వాసితులు అడ్డుకున్నారు. రిజర్వాయర్ కట్ట నిర్మాణ పనులు కొనసాగిస్తున్న యంత్రాల దగ్గరకు వెళ్లి పనులను నిలిపివేయించారు. టిప్పర్లను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. తదుపరి రిజర్వాయర్ కట్టపై టెంట్ వేసుకొని ఆందోళనకు దిగారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీని పెంచడంతో పాటు వెంటనే తమకు పరిహారాన్ని అందించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెరిగిన ధరలకు అనుగుణంగా భూపరిహారాన్ని కూడా అదనంగా చెల్లించాలని కోరారు. 18ఏళ్లు నిండిన యువతకు సైతం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలన్నారు. తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాకే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీఐ కమలాకర్, ఎస్ఐ శివానందంగౌడ్ ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. నిర్వాసితులతో వారు మాట్లాడి ఆందోళనను విరమించాలని కోరారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునే దిశగా ముందుకెళ్లాలని సూచించారు. మాజీ సర్పంచ్‌లు వెంకటయ్య, శంకరయ్యగౌడ్, మాజీ ఉపసర్పంచ్ శేఖర్, నాయకులు రామక్రిష్ణ, హన్మంతు, శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు.

రసాయన రంగులు తొలగించాలి

- వేంకటేశ్వరస్వామి ఆలయానికి పూర్వవైభవం తేవాలి
- పురావస్తు పరిశోధకుడు డా.ఈమని శివనాగిరెడ్డి



ఆలయానికి వేసిన రంగులను పరిశీలిస్తున్న డా.ఈమని శివనాగిరెడ్డి, తదితరులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవల్‌తిర్మలాపూర్‌లోని శ్రీ భూనీలవేంకటేశ్వర స్వామి ఆలయ గోడలు, మండప స్తంభాలపై వేసిన రసాయన రంగులు తొలగించి ఆలయానికి పూర్వ వైభవం తేవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డా.ఈమని శివనాగిరెడ్డి అన్నారు. బుధవారం వెన్నెల సాహిత్య అకాడమీ అధ్యక్షుడు ముచ్చర్ల దివాకర్‌తో కలిసి దేవల్‌తిర్మలాపూర్‌లోని ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భాలయం, అర్ధమండపం, మండపాలకు 400 ఏళ్ల చరిత్ర ఉందని అన్నారు. విజయనగర చక్రవర్తుల కాలం నాటి ఆలయంపై రకరకాల రసాయనాలు వేశారని, ఆనాటి వాస్తు, శిల్పకళా వైభవానికి ప్రమాదం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రసాయన రంగులు తొలగించేందుకు అధికారులు, పూజారులు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ స్థపతి భీమిరెడ్డి, వెంకట్‌రెడ్డి, బడేసాయికిరణ్‌రెడ్డి, ఎల్లయ్యలు పాల్గొన్నారు.

మైసమ్మ దేవత ఆలయ పరిశీలన

నాయినపల్లి మైసమ్మ దేవత వద్ద కొత్తగా నిర్మించిన ఆలయాన్ని పురావస్తు పరిశోధకుడు డా.ఈమని శివనాగిరెడ్డి ఆలయ చైర్మన్ శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు. ఆలయంలో చేపట్టాల్సిన పనులను చైర్మన్‌కు సూచించారు. భక్తుల సౌకర్యం కోసం కొత్తగా ఏర్పాటుచేసే షెడ్లు, ఇతర గదులను నిర్మించే ప్రదేశాలను పరిశీలించారు.

కాకతీయ కళాఖండాలను కాపాడుకోవాలి

కందనూలు: జిల్లాకేంద్రానికి సమీపంలో ఉన్న శ్రీపురం శ్రీ రంగనాథస్వామి ఆలయం ప్రాంగణంలోని కాకతీయ కళాఖండాలు ఆలనాపాలనా లేక నిరాధారణకు గురవుతున్నాయని శివనాగిరెడ్డి అన్నారు. బుధవారం రంగనాథస్వామి ఆలయ ప్రాంగణం వెలుపల చెట్టు కింద పడి ఉన్న క్రీ.శ.13వ శతాబ్దానికి చెందిన నాలుగు స్తంభాలు, వజ్ర డిజైన్లు ఉన్న దూలాన్ని పరిశీలించారు. 800 సంవత్సరాల నాటి ఈ శిల్ప కళాఖండాలను భద్రపరచాలని ఆలయ అధికారులకు, ధర్మకర్తలకు విజ్ఞప్తి చేశారు.


సెల్‌ఫోన్ చోరీ కేసులో వ్యక్తికి జైలుశిక్ష

వనపర్తి: సెల్‌ఫోన్ చోరీ కేసు రుజువైనందున ఓ వ్యక్తికి న్యాయమూర్తి బి.శ్రీలత 6 నెలల 10 రోజుల జైలుశిక్షతో పాటు రూ.వంద జరిమానా విధించినట్లు వనపర్తి డీఎస్పీ జె.వెంకటేశ్వర్‌రావు బుధవారం తెలిపారు. గోపాల్‌పేట మండలం ఏదులకు చెందిన తెలుగు బొక్కలయ్య 2014, ఆగష్టు 1న వనపర్తికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు బస్టాండుకు రాగా బస్సు తప్పిపోవడంతో రాత్రి అక్కడే పడుకున్నారు. అర్ధరాత్రి లేచి తన దగ్గరున్న సెల్‌ఫోన్‌లో వీడియోలు చూస్తుండగా పక్కనే ఉన్న కోడేరు మండలం పసుపులకు చెందిన మల్లేశ్ ఫోన్ లాక్కొని అతడిని కిందపడేసి పారిపోయాడు. గాయాలైన బొక్కలయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్ఐ జయన్న కేసు నమోదు చేసి మల్లేశ్‌ను అరెస్టు చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత ఎస్ఐ హరిప్రసాద్ ఆదేశానుసారం కోర్టు కానిస్టేబుల్ రాజశేఖర్ సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీతదేవి వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో ఫస్ట్ అడిషనల్ జేఎఫ్‌సీఎం న్యాయమూర్తి బి.శ్రీలత బుధవారం జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ తప్పించుకోలేరని.. ప్రజలు కూడా చట్టాన్ని తమ చేతిలోకి తీసుకోవద్దని డీఎస్పీ సూచించారు.

విద్యార్థి తరగతి గదిలో ఉండగానే తాళం



తరగతి గది తాళం పగులగొడుతున్న విద్యార్థి తండ్రి..



తరగతి గది నుంచి బయటకు వస్తున్న విద్యార్థి శరత్

లింగాల: విద్యార్థి తరగతి గదిలో ఉండగానే ఉపాధ్యాయులు తాళం వేసి వెళ్లిన సంఘటన మండలంలోని శాయిన్‌పేట ప్రాథమికోన్నత పాఠశాలలో చోటుచేసుకుంది. వివరాలిలా.. బుధవారం సాయంత్రం పాఠశాల సమయం అయిపోగానే విద్యార్థులందరూ ఇళ్లకు వెళ్లిపోగా ఉపాధ్యాయులు గదులకు తాళాలు వేసి వెళ్లిపోయారు. అయితే ఒకటో తరగతి విద్యార్థి శరత్ నిద్రపోవడంతో గదిలోనే ఉండిపోయాడు. సాయంత్రం 3:30గంటలకు ఇంటికి రావాల్సి ఉండగా.. 4 గంటలు దాటినా కుమారుడు ఇంటికి రాకపోవడంతో తండ్రి మల్లేష్ పాఠశాలకు వెళ్లి వెతికాడు. ఈ క్రమంలో ఓ తరగతి గది కిటికి తెరచి చూడగా శరత్ నిద్రించి కనిపించాడు. వెంటనే గది తాళం పగులగొట్టి కుమారుడిని బయటకు తీసుకవచ్చాడు. ఉపాధ్యాయులు గదులకు తాళం వేసే ముందు క్షుణ్ణంగా పరిశీలించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ విషయమై హెచ్ఎం గణేష్ వివరణ ఇస్తూ ప్రతిరోజు 3 గంటలకే స్టడీ అవర్స్ నిర్వహించి విద్యార్థులను బయట కూర్చోపెట్టడం జరుగుతుందన్నారు. శరత్ గదిలో నిద్రించినట్లు గమనించలేదని, ఇక ముందు ఇలాంటి ఘటనలు జరగకుండా చూస్తామని చెప్పారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి



జిల్లా సబ్ జూనియర్ కబడ్డీ జట్లతో సంఘం ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో జిల్లా జట్లు మెరుగైన ప్రతిభ కనబరిచి విజేతగా నిలవాలని జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి కురుమూర్తిగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో బుధవారం జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికలకు 90 మంది బాలబాలికలు హాజరైనట్లు తెలిపారు. వీరిలో ప్రాబబుల్స్ క్రీడాకారులను ఎంపిక చేశామని, ప్రత్యేక కోచింగ్ క్యాంప్ నిర్వహించి తుది జట్టును తర్వాత ప్రకటిస్తామని చెప్పారు. వికారాబాద్‌లో ఈనెల 20 నుంచి 23 వరకు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ టోర్నీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ సంఘం శ్రీధర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, ఎం.శ్రీనివాసులు, నర్సింలు, కార్యనిర్వాహక కార్యదర్శులు బాల్‌రాజు, పాపారాయుడు, యూ.శ్రీనివాసులు, కె.నర్సింలు, గణేష్, ఆర్.శ్రీనివాసులు, అనురాధ పాల్గొన్నారు.